క్లుప్తంగా

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



సరియాపల్లిలో పైపులైన్ ఏర్పాటు పనులు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నానని సర్పంచ్ వంతాల రత్న అన్నారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ సరియాపల్లి గ్రామంలో గురువారం పంచాయతీ నిధులతో బోరువెల్ పనులు చేయించి, మోటార్‌ను బిగించి, నీటి సరఫరా చేయించారు. దీంతో గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రత్న మాట్లాడుతూ రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించామన్నారు. పంచాయతీ నిధులతో తాగునీటి బోర్లు, గ్రావిటీ పథకాలు బాగు చేశామన్నారు. దశల వారీగా పంచాయతీ అభివృద్ధి కృషి చేయడం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత మోహన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

24న మండల స్థాయి ప్రతిభ పోటీలు



హెచ్‌ఎంలకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నిర్వాహకులు

ఎటపాక: మండలంలోని జిల్లా పరిషత్, ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు హోలీ స్పిరిట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24న ప్రతిభ పోటీలు నిర్వహించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్, రవి తెలిపారు. గౌరిదేవిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. వ్యాసరచన, డిబేట్, క్విజ్, దేశభక్తి పాటల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించండి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

గంగవరం: రహదారి భద్రత నియమాలను వాహనచోదకులు తప్పనిసరిగా పాటించాలని గంగవరం ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని గురువారం వాహన తనిఖీలను ఆయన సిబ్బందితో కలిసి నిర్వహించారు. రికార్డులు సరిగాలేని వాహనచోదకులు, యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. వాహన రికార్డులు లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన అవసరం

వి.ఆర్.పురం: పీసా కమిటీ సభ్యులకు రేఖపల్లి ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నాడు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డీఎస్ ఫౌండర్ డైరెక్టర్ వి.గాంధీబాబు పీసా కమిటీ విధులు, బాధ్యతలు, గ్రామాల్లో అభివృద్ధి పనులపై పీసా కమిటీ తీర్మానం తదితర అంశాలను వివరించారు.

ప్రీప్రైమరీ విద్యపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంఈవోలు చెల్లయ్య, ఈశ్వరరావు, సీడీపీవో బాలచంద్రమణిదేవి

హుకుంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణి దేవి ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీ ప్రైమరీ విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు చెల్లయ్య, ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యపై చిన్నారులకు ఆసక్తి కలిగించేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి యలమంచిలికి చెందిన తొగరు అక్కయ్య రూ.లక్ష 116 విరాళం ఇచ్చారు. దాతకు స్టోర్స్ సీనియర్ అసిస్టెంట్ పి.సూరిబాబు బాండ్ అందించారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం ఉద్యోగి హరి పాల్గొన్నారు.

గ్రామాల్లో దాహం కేకలు

- వేసవికి ముందే చింతపల్లిలో తాగునీటి కష్టాలు
- పాడైన తాగునీటి పథకాలు
- ఊటగెడ్డ నీటినే వినియోగిస్తున్న గ్రామస్తులు



చింతపల్లి సాయినగర్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న స్థానికులు



చింతపల్లిలో నిరుపయోగంగా మారిన చేతిబోరు

చింతపల్లి: వేసవికి ముందే పాడేరు నియోజకవర్గంలోని చింతపల్లిలో దాహం కేకలు వేస్తున్నాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. ఈ పరిధిలోని చాలా ప్రాంతాల్లో రక్షిత మంచి నీటి పథకాలు పాడై మూలకు చేరాయి. చేతిపంపులు పనిచేయడం లేదు. దీంతో స్థానికులు గత్యంతరం లేక బిందెడు నీటి కోసం కిలోమీటర్లు దూరంలో ఉన్న ఊట గెడ్డలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. మండుటెండలో కాలినడకన సుదూరంలో ఉన్న గెడ్డలకు వెళ్లి నీటిని తీసుకొస్తున్నారు. గెడ్డల్లోని కలుషిత నీరు వినియోగంతో రోగాల బారిన పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో తాగునీటి పథకాలు మూలకు చేరి నిరుపయోగంగా మారాయి. దీంతో తాగునీటి ఇబ్బంది నెలకొంది.



గెడ్డనీటిని సేకరిస్తున్న గిరిజన మహిళ

పెదపైపు ఆధారం

చింతపల్లి మండల కేంద్రంతో పాటు మేజరు పంచాయతీగా ఉంది. ఇక్కడ జనాభా సుమారు పదివేలకు పైగా ఉన్నారు. చింతపల్లి తరువాత అత్యధిక జనాభా కలిగిన పంచాయతీగా తాజంగి ఉంది. లోతుగెడ్డ, అన్నవరం తదితర పంచాయతీల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. పేరుకు మేజరు పంచాయతీ అయినప్పటికీ చింతపల్లిలో తాగునీటికి ఎప్పుడో బ్రిటిష్ కాలం నాటి పెదపైపు ఊటబావి నీటిపైనే స్థానికులు అధికంగా ఆధారపడుతున్నారు. ప్రధానంగా ఇంటింటికీ ఇబ్బడిముబ్బడిగా మోటార్లు ఏర్పాటుతో నీటి వనరులు ఇంకిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో తాగునీటికి వేసవిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా చింతపల్లిలోని సాయినగర్ వీధిలో తాగునీటికి మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చింతపల్లి ప్రాంతానికి తాగునీరందించే సీపీడబ్ల్యూ స్కీం ఒక్కటే ఉంది. ఇది ప్రజల అవసరాలను ఏ మాత్రం తీర్చలేకపోతోంది. తరచూ మోటార్లు కాలిపోవడం పైపులైన్ల లీకేజీ వంటి సమస్యల వల్ల తాగునీరు అందడం లేదు. దీంతో స్థానిక మహిళలు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరంలోని ఊటబావుల వద్దకు వెళ్లి బిందెలతో నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అన్నవరంలోనూ తాగునీటి ఎద్దడి అధికంగా ఉంది. ఏటా వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తాగునీటి సరఫరా విభాగం అధికారులు చెబుతున్నా ఆచరణలో అమలుకు నోచుకోవడంలేదు. ప్రస్తుతం క్రాష్ ప్రోగ్రాం అమల్లో ఉంది. మండల కేంద్రంలోని అత్యధిక శాతం చేతిపంపులు పాడై ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల చింతపల్లి మండలంలో పర్యటించిన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు స్థానికులు తాగునీటి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పాడై నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకాలను పరిశీలించారు. దీనిపై ఆయన తక్షణమే స్పందించి పాడైన తాగునీటి పథకాలను బాగుచేసి గిరిజనులకు తాగునీరు అందించాలని అధికారులకు సూచించారు.

అధికారులు స్పందించాలి

గ్రామంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బోర్లు పాడై.. బావులు ఎండిపోయి నీటి కోసం అల్లాడుతున్నాం. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నాం. అధికారులు స్పందించి గ్రామంలో పాడైన పైపులైన్, ట్యాంకు, బోర్లు బాగుచేసి నీటి సరఫరా సక్రమంగా అందేలా చూడాలి.

– కిల్లో లక్ష్మి, చింతపల్లి

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే క్రాష్ ప్రోగ్రాంను అమలు చేస్తున్నాం. సంచార వాహనం ద్వారా చేతిపంపులకు మరమ్మతులు చేపడుతున్నాం. సీపీడబ్ల్యూ స్కీం ద్వారా నిర్వహణ చర్యలు చేపట్టి తాగునీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– స్వర్ణలత, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈఈ చింతపల్లి

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



స్టడీ టూర్ నుంచి వచ్చిన విద్యార్థినులు

రాజవొమ్మంగి: బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఉదయం ప్రత్యేక బస్సులో స్టడీ టూరుకు వెళ్లి.. సాయంత్రానికి పాఠశాలకు చేరుకొన్నారు.

ఆయా విద్యార్థులు అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీను సందర్శించినట్టు హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతికి చెందిన 31 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయులు శాంతిప్రియ, అప్పారావు తదితరులున్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచేందుకు ఇటువంటి స్టడీ పర్యటనలు దోహదపడతాయని హెచ్‌ఎం గోపాలకృష్ణ చెప్పారు.

ఘనంగా ఫేర్‌వెల్‌డే



పాఠశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భవాని



విద్యార్థినుల నృత్యాలు

డుంబ్రిగుడ: పదో తరగతి పరీక్షల్లో శాతశాతం ఉత్తీర్ణతే ప్రధాన లక్ష్యంగా విద్యార్థులు సిద్ధం కావాలని ఎంఈవో శెట్టి సుందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో గురువారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో శెట్టి సుందరరావు మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.భవాని మాట్లాడుతూ పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులు కూడా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి పాఠశాలను జిల్లా స్థాయిలో నిలపాలని కోరారు. ఫేర్‌వెల్ డే సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు కుమారి, సుజాత, పద్మ పాల్గొన్నారు.

వెదురుపర్తి హైస్కూల్‌లో భాషా పండగ



ఆంగ్ల భాషపై ఏర్పాటుచేసిన పోస్టర్‌లను తిలకిస్తున్న విద్యార్థులు

కోటవురట్ల: మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం భాషా పండగ (లాంగ్వేజ్ ఫెస్టివల్) ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు కె.సబితలక్ష్మి, బోయిన చిన్నారావు ఇంగ్లిష్‌కు సంబంధించిన అంశాలను పాటలు, పద్యాలు, ఆటల రూపంలో విద్యార్థులకు వివరించి అవగాహన కలిగించారు. హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ భాషా పండగలు పాఠశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థులకు చదవడం, రాయడం, వినడం, మాట్లాడటంలో పరిణతి పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. దీంతోపాటు నైపుణ్యం, విషయ అవగాహన, భాష మీద పట్టు సాధించవచ్చునన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

- అయిదుగురిపై బైండోవర్ కేసు నమోదు

పెదబయలు: మండలంలోని గుల్లేలు పంచాయతీ చీమకొండ గ్రామ శివారులో పేకాటడుతున్నట్టు అందిన సమాచారంతో దాడి చేసి ఐదుగురు నిందితులను అదుపులో తీసుకున్నట్టు ఎస్‌ఐ కె.రమణ తెలిపారు. చీమకొండ గ్రామ శివారు కొండ ప్రాంతంలో పేకాట శిబిరంపై గురువారం మధ్యాహ్నం దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులో తీసుకున్నట్టు చెప్పారు. వారి నుంచి రూ.5,470 నగదు స్వాధీనం చేసుకున్నామని, పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి మండల మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి బైండోవర్ చేయడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఘనంగా మరిడిమాంబ జాతర

తుమ్మపాల: పట్టణంలో విజయరామరాజుపేటలో కొలువుదీరిన మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సాంఘిక నాటకాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నూకాంబిక మాలధారణ ప్రారంభం

అనకాపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి మాలధారణ కార్యక్రమాన్ని గురువారం నూకాంబిక అమ్మవారి మాలధారణ సంఘం వ్యవస్థాపకుడు పాలిమేర శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 రోజుల అర్ధ మండల దీక్ష చేపట్టే భక్తులు వచ్చే నెల 9న మాలధారణ చేస్తారన్నారు. నవరాత్రుల దీక్ష చేపట్టే భక్తులు ఈ నెల 21న మాలధారణ చేపడతారని చెప్పారు. వచ్చేనెల 25న అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

జీడికి మంచుదెబ్బ

- మాడిపోతున్న పూత
- ఆందోళనలో జీడిరైతులు



పూతతో కళకళలాడుతున్న జనుము చేను



కొండపాలెంలో మంచు బారిన జీడితోట

రోలుగుంట: వాతావరణ ప్రభావంతో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. దాంతో జీడిపూత మాడిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తీవ్రంగా పంట నష్టం తప్పదని వాపోతున్నారు. మండలంలో జీడితోటలు పూత దశలో ఉన్నాయి. పిందెలు వేసే దశలో పొగమంచుతో పూత మాడిపోయి నేల రాలిపోతోంది. మండలంలో 3,200 ఎకరాలపైగా జీడి తోటలున్నాయి. వరితో సమానంగా రైతులు జీడి సాగు చేస్తున్నారు. వరి తిండి గింజలకు కాగా, జీడితోటు సాధారణ ఖర్చులకు ఆదాయం తెచ్చుపెడుతోంది. దీంతో రైతులు డిసెంబరు నెలాఖరు నుంచి జనవరి మొదటి వారంలో తోట గొప్పులు, కలుపుతీత పనులు పూర్తి చేసుకున్నారు. అందుకు తగ్గట్టుగానే తోటలు పూతతో వికసిస్తుండగా మంచు దెబ్బ పడింది. దీంతో తమ ఆదాయానికి గండి పడుతుందని రైతులు వాపోతున్నారు.

జనుము పంటకు మేలు చేస్తున్న పొగమంచు

మండల రైతాంగం ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంట కోత దశ ముగిసిన తర్వాత వాటి స్థానంలో పంట భూమిలో స్వల్పకాలిక పంట జనుము సాగు చేపట్టారు. ఈ పంట విత్తనాలు చల్లిన తర్వాత ఏ విధమైన పెట్టుబడి అవసరం ఉండదు. సాగు నీరు అవసరం ఉండదు. మంచు తడులు సరిపోతాయి. మండలంలో 900 ఎకరాలకుపై విస్తీర్ణంలో జనుము పంట వేశారు. ప్రస్తుతం చేను పూతతో కళకళలాడుతోంది.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, ఎంపీడీవో రమాదేవి తదితరులు



ప్రజా సమస్యలను అధికారులకు తెలియజేస్తున్న కో–ఆప్షన్ సభ్యుడు యాసీన్

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: గ్రామాల్లో ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్యే మత్స్యలింగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలోని 15 సెగ్మెంట్‌ల ఎంపీటీసీలు, 33 పంచాయతీ సర్పంచ్‌లు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను అధికారులకు తెలియజేశారు. పలువురికి సర్వసభ్య సమావేశం నోటీసులు అందించకపోవడంతో ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతు గ్రామాల పరిధిలో విద్య, వైద్య శాఖలతో పాటు మిగిలిన శాఖల అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో రమాదేవి, ఈవోపీఆర్డీ అప్పలరాజు, ఏవో సన్యాసిరావు, డీటీ కృష్ణారావు, వైస్ ఎంపీపీలు కొండలరావు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పనులు పూర్తి చేయాలి



అసంపూర్తి పాఠశాల భవనం వద్ద విద్యార్థులు, గ్రామస్తులతో సర్పంచ్ సునీత

డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ జంగిడివలస గ్రామంలో అసంపూర్తిగా ఉన్న భవనం పనులు తక్షణమే ప్రారంభించాలని సర్పంచ్ సునీత, మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. ఇందులో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు వెచ్చించారన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని గసభ పంచాయతీ జంగిడివలస గ్రామంలోని పాఠశాల భవనం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.34లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే ఎన్నికల కోడ్ వల్ల పనులు నిర్మాణ దశలో నిలిచిపోయాయన్నారు. పాఠశాల కమిటీ బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అయినా కూడా పనులు చేయడం లేదని మండిపడ్డారు. పాఠశాల భవనం లేకపోవడంతో స్థానిక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనాన్రు. ఆరుబయట విద్యాబోధన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేసి పాఠశాల భవనం అందుబాటులో తీసుకురావాలని వారు కోరారు. వార్డు సభ్యుడు పాంగి సత్యనారాయణ, పాఠశాల కమిటీ సభ్యులు ప్రసాద్, గాసి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ముగ్గురికి గాయాలు







చికిత్స పొందుతున్న క్షతగాత్రులు లక్ష్మయ్య, శివరాం, రాంబాబు

చింతపల్లి: జీకే వీధి మండలం వీరవరం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో వంచుల పంచాయతీ కొత్తపాలెం గ్రామానికి చెందిన మెట్టపాటి లక్ష్మయ్య, సంకాడ పంచాయతీ గైగంపల్లికి చెందిన చెదల శివరాం, కొట్నాపల్లికి చెందిన మెట్టపాటి రాంబాబులు గాయపడ్డారు. వీరికి చింతపల్లి ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి రుక్మిణి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

ప్రశాంతంగా శివరాత్రి ఉత్సవాల నిర్వహణ



ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: మహాశివరాత్రి మహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కురిడి ఉత్సవ కమిటీ సభ్యులు చూడాలని సీఐ హిమగిరి సూచించారు. కురిడిలో ఈ నెల 26న మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి కమిటీ సభ్యులతో సీఐ హిమగిరి గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండ చూడాలని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలతో పాటు చట్ట వ్యతిరేక ఆటలు నిర్వహించొద్దని సూచించారు. కమిటీ సభ్యులు ఎరుకుల నాయుడు, నాందీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నల్లమారమ్మ పండగ



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: మండలంలోని కొండలఅగ్రహారంలో నల్లమారమ్మతల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలిచే గ్రామస్తులు ఉదయం నుంచి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయ ధర్మకర్త గూడూరు వెంకటరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, పార్టీ నేత పోలిరెడ్డి రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

23న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

మాడుగుల రూరల్: దొర్ల గొటివాడ శివారు గొల్లల పాలెం గ్రామంలో ఈ నెల 23న అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ధూపదీప నైవేద్యాలతో పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతులుగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు అందజేస్తారన్నారు. గుర్రం పరుగు పందెం, పిడతలు, సైకిల్ పోటీలు, కోలాటం, తప్పెటగుళ్లు నిర్వహిస్తామన్నారు. రాత్రికి వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు

మాడుగుల రూరల్: బుద్ధిమాంద్యం దివ్యాంగ పింఛనుదారులకు నిర్ధారణ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయని ఎంపీడీవో కె. అప్పారావు తెలిపారు. అనకాపల్లి జిల్లా ఏరియా ఆస్పత్రిలో తొలి రోజు 30 మంది దివ్యాంగులకు పరీక్షలు చేశారన్నారు. ఈ నెల 24, 25, 27 తేదీల్లో మిగిలిన గ్రామాలకు చెందిన దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.